# సర్కారుపై పోరు.. దద్దరిల్లె ఊరు



# ఎన్నిసార్లు దరఖాస్తులు పెట్టాలి?

- రేషన్‌కార్డుల అప్లికేషన్లు ఏమాయె?
- ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంలో సర్కారు విఫలం
- రుణమాఫీపై శ్వేతపత్రం ఇవ్వాలి
- రైతులు ఆత్మహత్యలు ప్రభుత్వానికి పట్టడం లేదు
- ఎగవేతలు, కోతలు రేవంత్ నైజం
- సీఎం గ్రామసభలకు రావాలి
- అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి
- కార్యకర్తలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తే ప్రజాపోరాటం తప్పదు
- సిద్దిపేట జిల్లా గాడిచర్లపల్లి గ్రామసభలో హరీశ్‌రావు



గాడిచెర్లపల్లి గ్రామసభలో రుణమాఫీ కాలేదని రైతులు ఇచ్చిన దరఖాస్తులను, బ్యాంక్‌లో మిత్తి కట్టిన కౌంటర్ ఫైల్‌ను చూపుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 22( నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రజలు ఎన్నిసార్లు ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టాలి? దరఖాస్తు పెట్టిన ప్రతిసారీ రూ.30, రూ.40 ఖర్చు అవుతున్నది. ప్రజాపాలనలో అప్లికేషన్ పెట్టాం.. మీసేవలో అప్లికేషన్ పెట్టాం.. ఇప్పుడు మళ్లీ గ్రామసభల్లో అప్లికేషన్ పెట్టుకున్నాం.. అని ప్రజలు అంటున్నరు. ప్రజాపాలన కార్యక్రమంలో తీసుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్ చేయకపోవడంతో, కట్టగట్టి పక్కకుపడేయడంతో మళ్లీమళ్లీ దరఖాస్తులు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని 15వ వార్డు గాడిచర్లపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన సభలో ఆయన పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను విన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 13 నెలలు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా రేవంత్ సర్కార్ అమలు చేయలేదని విమర్శించారు.

### వీళ్లకి రుణమాఫీ కాలేదు

'గాడిచర్లపల్లికి చెందిన ఆకుల రాజుకు రూ.1.35 లక్షల రుణం ఉంటే ఇంకా మాఫీ కాలేదు. ప్రజాపాలనలో దరఖాస్తు పెట్టుకున్నడు. కుసుంబ నగేశ్‌కు రూ.లక్ష వ్యవసాయ రుణముంది. ఇంకా మాఫీ కాలేదు. బాగమ్మగారి పూజకు లక్ష రుణం ఉన్నది. నర్సింగరావుకు రూ.47 వేలు, ఏల్పుల రాములుకు రూ.42 వేలు అప్పు ఉన్నది. వీళ్లంతా లక్షలోపు రుణం ఉన్నవారే.. అయిన ఇంకా రుణమాఫీ కాలేదని గ్రామసభలో దరఖాస్తు పెట్టుకున్నరు. ఎం రాధకు రూ.లక్ష రుణమాఫీ కాలేదు. కే యాదయ్య రూ.1,60,000 రుణం తీసుకుంటే మాఫీ కాలేదు. ఊత బాలయ్య రూ.1,60,000కు అప్పు ఉన్నది. రుణమాఫీ కోసం అడిగితే మిత్తి రూ.13,000 కట్టుమని బ్యాంకు అధికారులు చెప్పారు. మిత్తి కట్టాడు. మిత్తి కట్టినాక కూడా రుణమాఫీ కాలేదు. మరిగే సుధాకర్ రూ.1,90,000 రుణం తీసుకుంటే మిత్తి కడితేనే రుణమాఫీ జరుగుతుందని చెప్పారంట. రూ.25వేలు బ్యాంకుకు మిత్తి కట్టాడు. ఇంకా రుణమాఫీ కాలేదు. సత్తయ్య దగ్గర రూ.68 వేల కట్టించుకొని రెండు లక్షల రుణమాఫీ చేయలేదు' అని హరీశ్‌రావు ఆధారాలతోసహా వివరించారు. నవంబర్ 30న రూ.2,750 కోట్లకు మహబూబ్‌నగర్‌లో రుణమాఫీ చెక్కు ముఖ్యమంత్రి ఇస్తే ఇప్పటివరకు రుణమాఫీ జరగలేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఇచ్చిన చెక్కే బౌన్స్ అయితే ప్రభుత్వ పరువు పోయినట్టే కదా అని ప్రశ్నించారు. రైతుల కోసం ఇచ్చిన చెక్కు రాకపోతే ఇచ్చే బాధ్యత ముఖ్యమంత్రికి, ఆర్థిక మంత్రికి లేదా? అని నిలదీశారు. రుణమాఫీపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదలచేయాలని డిమాండ్ చేశారు. ఎంతమంది రైతులకు రుణమాఫీ జరిగిందో ప్రభుత్వం చెప్పాలని కోరారు. రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వానకాలం రైతుబంధు డబ్బులు ఎప్పుడు వేస్తరని రైతులు అడుగుతున్నారని చెప్పారు. వానకాలం, యాసంగి కలిపి.. ఇచ్చినమాట ప్రకారం రూ.15,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'రూ.15,000 కోట్లతో ఔటర్ రింగ్‌రోడ్ వేస్తా అంటున్నవు. రూ.5000 కోట్లతో మీ ఊరికి ఆరులైన్ల రోడ్డు వేసుకుంటున్నవు. మీ ఊరికి రోడ్డు వేసుకునేందుకు పైసలుంటయి.. మూసి సుందరీకరణకు పైసలుంటాయి కానీ రైతులకు ఇవ్వడానికి డబ్బులు ఉండవా?' అని ప్రశ్నించారు.

### రేషన్‌కార్డుల దరఖాస్తులు ఏమయ్యాయి?

రేషన్‌కార్డుల కోసం గతంలో ఇచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దరఖాస్తుల పేరుతో ప్రజల ఉసురు ఎందుకు పోసుకుంటున్నరు. ప్రజల డబ్బులు ఎందుకు వృథా చేస్తున్నరు అని మండిపడ్డారు. అర్హులైన అందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదేండ్ల కింద కేసీఆర్ రేషన్‌కార్డుల కోసం ఆదాయం పరిమితిని రూ. 60 వేల నుంచి రూ.1.5 లక్షలకు, అర్బన్‌లో రూ.75 వేల నుంచి రూ.2.55 లక్షలకు పెంచారని గుర్తుచేశారు. 2024లో కూడా అదే పరిమితితో రేషన్‌కార్డులు ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గమని మండిపడ్డారు. ఏడాదికి ఐదు లక్షల ఇండ్లు కడతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఏడాది పూర్తయినా ఒక్క ఇల్లయినా కట్టిందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చిన ఇండ్లే తప్ప కట్టిన ఇండ్లు లేవని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.ఆరు లక్షలు ఇస్తమని చెప్పి, ఇప్పటివరకు ఒక ఇల్లు కూడా కట్టించలేదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలకు ఇల్లు కట్టుకునేందుకు రూ.ఆరు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో కూలీలందరికీ న్యాయం చేస్తామని చెప్పి ఇప్పుడు కొందరు మాత్రమే అర్హులు అనడం దుర్మార్గమని మండిపడ్డారు. రకరకాల సాకులతో కోతలుపెట్టి కోటి మంది కూలీలు ఉంటే ఆరు లక్షల మందికి మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయభరోసా ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆరు పైసలు ఇచ్చి 94 పైసలు ఎగబెడుతున్నరు. రుణమాఫీ 30 పైసలు ఇచ్చి, 70 పైసలు ఎగబెట్టారు. రైతుభరోసా వానకాలం ఎగపెట్టిరు, యాసంగి కూడా ఇచ్చే పరిస్థితి లేదని మండిపడ్డారు.

### ఇన్‌చార్జి మంత్రుల పేరిట ఇండ్లు ఇస్తే ఊరుకోం

పేదలకు, అర్హులైన వారందరికీ ఇండ్లు ఇవ్వాలి. ఇన్‌చార్జి మంత్రుల పేరిట కార్యకర్తలకు ఇండ్లు ఇస్తే ప్రజాపోరాటం తప్పదని హరీశ్‌రావు హెచ్చరించారు. కాంగ్రెస్ తప్పులకు అధికారులు బలవుతున్నారని, గ్రామాల్లో ప్రజలు అధికారులను నిలదీస్తున్నారని చెప్పారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.30 వేలు బాకీ పడిందని విమర్శించారు. జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ గెలిచిన తర్వాత ఇచ్చినమాట ప్రకారం మహిళలకు రూ.2,500 ఇస్తున్నారని గుర్తుచేశారు. పొరుగు రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అయినంక పెన్షన్లు పెంచి రూ.4వేలు ఇస్తున్నారని, రేవంత్‌రెడ్డి.. అవ్వాతాతలకు ఎప్పుడు ఇస్తరని ప్రశ్నించారు.

> **రాష్ట్రంలో రైతులందరికీ సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ పూర్తిచేసినామని మాట్లాడుతున్నరు. గాడిచర్లపల్లి చిన్న గ్రామం. ఇక్కడ రుణమాఫీ కానీ రైతులే ఎక్కువ. రేవంత్‌రెడ్డి.. మీ సొంత ఊరికి పోదామా? మా గాడిచర్లపల్లికి వస్తవా? రుణమాఫీ ఎంతమందికైందో, ఎంతమందికి కాలేదో చూపిస్తా - హరీశ్‌రావు**

> **ముఖ్యమంత్రి హైదరాబాద్‌లో ఉండటం కాదు, ఊర్లలో గ్రామసభలకు రావాలి. పోలీస్ పహారాల మధ్య, నిర్బంధాల మధ్య గ్రామసభలు నిర్వహిస్తున్నారు. మాట్లాడితే అరెస్టు చేస్తున్నారు. -హరీశ్‌రావు**

> **ఎగవేతల రేవంత్‌రెడ్డి, కోతల రేవంత్‌రెడ్డి.. ఎన్నికల ముందు కోతలు.. ఎన్నికల తర్వాత ఎగవేతలు.. రేవంత్‌రెడ్డికి నిజాయతీ, చిత్తశుద్ధి ఉంటే యాసంగి, వానకాలానికి కలిపి రైతుబంధు ఇవ్వాలి. -హరీశ్‌రావు**

## సంక్షేమానికి సర్కారీ 'కోత'లు

**60 వేల మందికి చేయూత పింఛన్ల కోత**

**మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్**

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా నుంచి తొలగిస్తూ కాంగ్రెస్ 'కోత'ల సర్కార్‌గా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక్క చేయూత పింఛన్లనే ఏకంగా 60 వేల మంది లబ్ధిదారులకు కోత పెట్టి పాపం మూటగట్టుకున్నదని ఎక్స్‌వేదికగా మండిపడ్డారు. చేయూత పింఛన్ లబ్ధిదారుల సంఖ్య 2023-24 ఆర్థిక సంవత్సరంలో 43.3 లక్షలు ఉంటే, 2024-25 ఆర్థిక సంవత్సరానికి 42.7 లక్షలకు తగ్గిందని పేర్కొన్నారు. అంటే 60 వేల మంది లబ్ధిదారులకు పింఛన్లు అందకుండా కాంగ్రెస్ సర్కారు కోతలు పెట్టిందని తెలిపారు. ఆసరా పింఛన్లను రూ.2,000 నుంచి రూ.4,000కు పెంచడం దేవుడెరుగు, లబ్ధిదారుల సంఖ్యలో కోతలు మొదలు పెట్టడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు.



కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాట్లాడిన వీడియోను చూపిస్తున్న వేముల

## గ్రామసభలు కాదు.. బోగస్ సభలు

- దరఖాస్తుల పేరిట ముప్పతిప్పలు పెడుతున్న ప్రభుత్వం
- ఏడాది దాటినా ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదు
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్, జనవరి 22: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలన్నీ బోగస్ సభలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ప్రజాపాలన, గ్రామసభల పేరిట ప్రజలను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలు, 420 హామీలను వందరోజుల్లో అమలుచేస్తానని చెప్పి గద్దెనెక్కారని తెలిపారు. హామీలు అమలుచేయమంటే అప్లికేషన్ల పేరిట ప్రజలను జిరాక్స్ సెంటర్లు, మీ సేవ కేంద్రాలు, మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ ఏడాదికాలంగా తిప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏడాది పొడవునా ఇచ్చిన దరఖాస్తులు ఎక్కడపడేశారని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానుండడంతో ప్రజలను మభ్యపెట్టడానికే గ్రామసభల డ్రామా ఆడుతున్నారని దుయ్యబట్టారు. 'గ్రామసభలు పేరుకే నిర్వహిస్తున్నారని, కాంగ్రెస్ కార్యకర్తలు చెప్పినవారికే ఇండ్లు, రేషన్‌కార్డులు వస్తాయని' కాంగ్రెస్ పార్టీ నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తెలిపారని చెప్పారు. అన్నీ వారికే ఇస్తే గ్రామసభలు, అధికారుల సర్వే ఎందుకని ప్రశ్నించారు.

### గ్రామసభల్లో పట్టుబట్టండి

పథకాల జాబితాలో అర్హుల పేర్లు ఉండేలా లబ్ధిదారులు గ్రామసభల్లో పట్టుబట్టాలని, అప్పుడే న్యాయం జరుగుతుందని వేముల పేర్కొన్నారు. గ్రామాల్లో లబ్ధిదారులు వారి పేర్లు జాబితాలో లేకపోవడంతో అధికారులను నిలదీస్తున్నారని చెప్పారు. అర్హులకు అండగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఉంటారని చెప్పారు. ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని నిలదీయాలని పిలుపునిచ్చారు.

## లోకం పోకడ




ఉద్యోగాలు అడిగితే ఉత్తరేణి గుళికలు, పింఛన్ అడిగితే ఆముదం తైలం, ఇండ్లు కట్టించమంటే మారేడు కషాయం ఇచ్చి పంపిస్తున్నాడు!

## హామీలిస్తరు.. అడిగితే దాడులు చేస్తరు

- పోలీసుల సమక్షంలోనే దాడులు సిగ్గుచేటు
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం



హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): 'అవి ఇస్తం.. ఇవి ఇస్తం అని ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ నేతలు ఎన్నో హామీలిచ్చిండ్రు. ఇప్పుడు ఆ హామీలు ఏమయ్యాయని అడిగితే దాడులు చేయిస్తున్నరు. గ్రామసభల్లో అర్హులను పక్కనబెట్టి అనర్హులకు పథకాలు అందిస్తున్నరు' అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ సర్కార్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి స్వగ్రామం నరసయ్యపల్లిలో నిర్వహించిన గ్రామసభకు 100 మంది గూండాలతో వెళ్లి రేషన్‌కార్డు, ఇల్లు ఇవ్వాలని అడిగిన గ్రామస్థులపై దాడి చేశారని మండిపడ్డారు. తమకు పథకాలు రాలేదని ప్రశ్నించిన మంతెన బాల్‌రెడ్డి అనే వ్యక్తిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేస్తున్నా.. పోలీసులు చోద్యం చూశారే తప్ప అడ్డుకోలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులకు అండగా నిలిచిన మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్‌తో పాటు ఇతర నాయకులను అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే నియోజకవర్గంలోని వడ్లకొండలో తమ కు ఇల్లు రాలేదని అడిగిన ఓ యువకుడిపై తీవ్రంగా దాడి చేశారని తెలిపారు.

## గిరిజన విద్యార్థి సంఘం డిమాండ్లు నెరవేర్చాలి

**మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**



మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, జనవరి 22 : గిరిజన విద్యార్థి సంఘం డిమాండ్లను నెరవేర్చాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు ఆయన మద్దతు ప్రకటించి మాట్లాడారు. రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఇవ్వాలని, గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## గ్రామ సభలు.. పెద్ద మాయ

**మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి**



నల్లబెల్లి, జనవరి 22: గ్రామ సభలు పెద్ద మాయ అని, ఎన్నికల స్టంట్ కోసమే రేవంత్ సర్కారు కుటిల యత్నం చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని తన నివాసంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు పోలీసు నిర్బంధాల మధ్య గ్రామసభలు నిర్వహించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. నల్లబెల్లి మండల కేంద్రంలో బుధవారం పోలీస్ కమిషనర్ మినహా వరంగల్ జిల్లా పోలీస్ యంత్రాంగం మధ్య గ్రామ సభ నిర్వహించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని తెలిపారు. మండల కేంద్రంలో జరిగే గ్రామసభకు యోజకవర్గంలో ఉన్న కాంగ్రెస్ నాయకులను రావాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పిలుపునివ్వడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రెండు రోజుల గ్రామ సభల్లో ప్రతి గ్రామంలో రైతుబంధు, రేషన్‌కార్డులు, రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై నాయకులు, అధికారులను నిలదీస్తుంటే సమాధానం చెప్పుకోలేక ప్రతి గ్రామ సభకు పోలీసులను మోహరించి ప్రశ్నించిన ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను మంజూరు చేసిన వందల కోట్ల నిధుల పనులను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రద్దుచేశారని, కేవలం లాభం వచ్చే పనులకు మళ్లీ టెండర్లు వేసి ఆయనే సొంతంగా నిర్వహిస్తూ లాభార్జనే ధ్యేయంగా సాగుతున్నారని ఆరోపించారు. గ్రామసభను కవరేజ్ చేస్తున్న మీడియా ప్రతినిధులపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తంచేయడం పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమేనన్నారు. పోలీసులపై రాజ్యాంగం, చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోనని హెచ్చరించారు.

## కాంగ్రెస్ కార్యకర్తలకే పథకాలు

**ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు**



గుమ్మడిదల, జనవరి 22 : కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరవుతున్నాయని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, జిల్లా యువత అధ్యక్షుడు వెంకటేశంగౌడ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నాయని తెలిపారు.

## 28న బీఆర్‌ఎస్ ధర్నాకు హైకోర్టు అనుమతి

**ఉత్తర్వులు జారీ చేయాలని పోలీసులకు ఆదేశం**



హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : రైతులకు ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక రూ.12 వేలుగా నిర్ణయించడాన్ని వ్యతిరేకిస్తూ నల్లగొండ క్లాక్‌టవర్ వద్ద ఈ నెల 28న చేపట్టనున్న ధర్నాకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు అనుమతి సంబంధించి పోలీసులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ధర్నా నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ధర్నాలో 1500 మంది వరకు పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని బీఆర్‌ఎస్ అభ్యర్థనను ఆమోదించింది. ధర్నా సందర్భంగా నేతల ప్రసంగం రెచ్చగొట్టేలా ఉండొద్దని సూచించింది. శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే పోలీసులు జోక్యం చేసుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను 29కి వాయిదా వేశారు.

### 21వ తేదీకి అనుమతి నిరాకరణ..

తొలుత ఈ నెల 21న చేపట్టిన ధర్నాకు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అనుమతి నిరాకరించారు. దీనిని సవాల్ చేస్తూ బీఆర్‌ఎస్ నల్లగొండ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున ఎం రూపేందర్ వాదనలు వినిపిస్తూ.. పోలీసులు శాంతియుత ధర్నాకు అనుమతి నిరాకరించడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఈ నెల 20న లంచ్ మోషన్ పిటిషన్ వేశామని, గ్రామసభలు, రిపబ్లిక్ డే ఏర్పాట్ల పనుల్లో పోలీసులు బిజీగా ఉంటారని చెప్పి ప్రభుత్వం వాయిదా కోరిందన్నారు. భద్రత ఏర్పాట్లకు ఇబ్బందని ప్రభుత్వ న్యాయవాది చెప్పడంతో ఈ కేసు విచారణ ఈ నెల 27కి వాయిదా పడినట్టు చెప్పారు. ఈ నెల 27న ధర్నాకు అనుమతి ఇవ్వాలని పోలీసులకు దరఖాస్తు చేస్తే అనుమతి ఇవ్వలేదని, తిరిగి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వ న్యాయవాది విజ్ఞప్తితో 28న ధర్నాకు అనుమతిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్టు చెప్పారు.

## హామీలను తప్పించుకునేందుకే కొత్తడ్రామా

- అందులో భాగమే రూ.40వేల కోట్లు అవసరమనే ప్రకటన
- కేసీఆర్ నిర్మించిన ఇండ్లకు ఇందిరమ్మ ఇండ్లంటే ఊరుకోం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద హెచ్చరిక



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కేపీ వివేకానంద. చిత్రంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): ప్రజలకు ఇచ్చిన హామీల నుంచి తప్పించుకునేందుకే రేవంత్ సర్కారు కొత్త డ్రామాకు తెరలేపిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆరోపించారు. అందుకు నిదర్శనమే ప్రజాపాలన దరఖాస్తులు, గ్రామసభల ద్వారాఎంపిక చేసిన పథకాలకు రూ.40వేల కోట్లు అవసరమవుతాయని పేర్కొనడమని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ సభల నిర్వహణ తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాసమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. విదేశాల్లో రాజభోగాల కోసం సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీని ప్రసన్నం చేసుకునేందుకు మంత్రులు తిరుగుతూ పాలనను గాలికి వదిలేశారని విమర్శించారు. పథకాలు ప్రజలకు కాదు, తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకే అని బహిరంగంగా కాంగ్రెస్ నేతలే చెప్తుండటం సిగ్గుచేటు అని మండిపడ్డారు.

### కాంగ్రెస్ నేతల చుట్టూ తిప్పే ప్రయత్నం..

దరఖాస్తులు అంటూ ప్రజలను కాంగ్రెస్ నేతల చుట్టూ తిప్పేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని మండిపడ్డారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలుచేస్తామని చెప్పి, 400 రోజులు దాటినా అమలుకు నోచలేదని విమర్శించారు. రోజుకో డ్రామాతో కాంగ్రెస్ నేతలు మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రేషన్‌కార్డు ఆదాయ పరిమితిని పెంచాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆరున్నర లక్షల రేషన్ కార్డులు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

### 'డబుల్' ఇండ్లను ఇందిరమ్మ ఇండ్లంటే సహించం..

కేసీఆర్ హయాంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇండ్లకు ఇందిరమ్మ ఇండ్లని పేర్లు పెడితే సహించేది లేదని వివేకానంద హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతనైతే కొత్తగా ఇండ్లు కట్టి వాటికి ఏ పేరైనా పెట్టుకోవచ్చని సూచించారు. ఇప్పటికే కట్టిన ఇండ్లను లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. లూటీ చేయడానికి తప్ప కాంగ్రెస్ నేతలు దేనికీ పనికిరారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, 40 శాతం వీధి దీపాలు వెలగకపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రానున్న రోజుల్లో గ్రేటర్ హైదరాబాద్ సమస్యలపై పోరాడుతామని తెలిపారు.



మంచిరేవులలోని నిరంజన్‌రెడ్డి నివాసంలో మీడియాతో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి. చిత్రంలో రసమయి బాలకిషన్, కోటిరెడ్డి, విజయ్‌కుమార్

## కాంగ్రెస్ నేతలు పెత్తందార్ల వారసులు

- మేం తిరుగుబాటుకు వారసులం
- రైతు ధర్నాకు కోర్టు అనుమతి
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): పెత్తందారులకు కాంగ్రెస్ నేతలు వారసులైతే, తాము తిరగబడే వారికి వారసులం అని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి తెలిపారు. గ్రామసభల్లో ప్రభుత్వంపై ప్రజలు ఎక్కడికక్కడ తిరగబడుతున్నారని తెలిపారు. దానికి బీఆర్‌ఎస్ నాయకత్వం వహిస్తే ఉప్పెనలా కదిలి నాలుగేండ్లు కూడా అధికారంలో ఉండలేమన్న భయం కాంగ్రెస్ పాలకుల్లో నెలకొన్నదని చెప్పారు. రంగారెడ్డి జిల్లా నార్సింగి మండలం మంచిరేవులలోని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నివాసంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్‌ఎస్ నేతలు కోటిరెడ్డి, విజయ్‌కుమార్‌తో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి కోమటిరెడ్డి కాంగ్రెస్ నేతలను పంపి బీఆర్‌ఎస్ నేతలపై దాడులు చేయించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి ఆదేశాలతోనే మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఇతర నేతలను పోలీసులు అరెస్టు చేశారని మండిపడ్డారు. ఇష్టారాజ్యం పోలీస్ రాజ్యం అమలు చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. దళారుల నుంచి మంత్రి కోమటిరెడ్డి రూ.500 కోట్ల లంచం తీసుకొని రైతులకు రూ.1,000 కోట్లకుపైగా నష్టం చేశారని విమర్శించారు. నష్టపోయిన రైతులు నల్లగొండ వేదికగా సత్తా చూపుతారని హెచ్చరించారు. నల్లగొండలో బీఆర్‌ఎస్ రైతు ధర్నాకు హైకోర్టు అనుమతించిందని జగదీశ్‌రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు అనుమతిచ్చిన హైకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ మరోసారి మోసం

**ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు**



మహబూబాబాద్ రూరల్, జనవరి 22 : ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మరోసారి మోసం చేస్తున్నదని ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు విమర్శించారు. బుధవారం మహబూబాబాద్‌లోని ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామసభలతో ప్రజలకు ఒరిగేదేమీలేదన్నారు. అధికారులు ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డులు తదితర పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారిపేర్లు మాత్రమే చదువుతున్నారని పేర్కొన్నారు. నిజమైన లబ్ధిదారులను సంక్షేమ పథకాలకు ఎంపిక చేయలేదని ఆరోపించారు. తులం బంగారం, వృద్ధులకు ఆరు వేల పెన్షన్, విద్యార్థినులకు స్కూటీల పంపిణీ, స్కాలర్‌షిప్ వంటివి ఇంకాఅమలు చేయలేదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి బోగస్ మాటలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో ప్రతి పేదకు లబ్ధి జరిగేలా పాలన అందించారని గుర్తుచేశారు. ప్రతి నిరుపేదకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.



నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు పల్లె రవికుమార్, దూదిమెట్ల బాలరాజు, ఇస్తావత్ రాంచంద్రనాయక్, మేడే రాజీవ్‌సాగర్, మందడి సైదిరెడ్డి తదితరులు

## కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి

**ఎస్పీకి మాజీ ఎమ్మెల్యే కంచర్ల ఫిర్యాదు**

నీలగిరి, జనవరి 22 : నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం తనపై, బీఆర్‌ఎస్ నాయకులపై దాడి చేసిన కాంగ్రెస్ నేతలు, వారికి సహకరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు పల్లె రవికుమార్, దూదిమెట్ల బాలరాజు, ఇస్తావత్ రాంచంద్రనాయక్, మేడే రాజీవ్‌సాగర్‌తో కలిసి ఆయన ఎస్పీ శరత్‌చంద్రపవార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పల్లె రవికుమార్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యేపై కాంగ్రెస్ నేతలు దాడి చేయడం అమానుషమని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో సభ జరిగితే కాంగ్రెస్ మోసాలు అందరికీ తెలుస్తాయనే ఉద్దేశంతోనే సభను అడ్డుకున్నారని విమర్శించారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నేతలపై మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో దాడిచేయడం దారుణమని మండిపడ్డారు.